క్లుప్తంగా

ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు



బాన్సువాడ : మంజీర ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని బీర్కూర్ తహసీల్దార్ జనార్దన్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో మంగళవారం బరంగెడ్గి, బీర్కూర్, దామరంచ, కిష్టాపూర్ గ్రామాల ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు, స్థానిక నాయకులతో తహసీల్దార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడంతోపాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పనుల కోసం అనుమతులు తీసుకోవాలన్నారు. ఎస్సై నర్సింలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు ఆకాశ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ ఆకాశ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీహెచ్ఈవోలు వెంకటరమణ, సతీశ్, ఏఎన్ఎం శ్యామల, ఆశ వర్కర్ సబిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి




నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని నాగిరెడ్డిపేట మండల పంచాయతీ అధికారి(ఎంపీవో) శ్రీనివాస్ సూచించారు. మండలంలోని బంజర గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. హౌస్‌హోల్డ్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి మమత ఉన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని మండల నోడల్ అధికారి షౌకత్అలీ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని మత్తడికింది పల్లె ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వార్షిక ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట హెచ్ఎం సవిత, సీఆర్పీ గంగాధర్ తదితరులున్నారు.

దేవాలయాల్లో దీపాలంకరణ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో గల శివాలయం, హనుమాన్ ఆలయాల్లో భక్తులు మంగళవారం దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీకఅమావాస్య సందర్భంగా పటాకులు కాల్చారు.

మొక్కలను సంరక్షించాలి



పిట్లం(జుక్కల్): మండలంలోని గౌరారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మండల పంచాయతీ అధికారి బ్రహ్మం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం మొక్కలను సంరక్షించాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ పనులున చేపట్టాలని కార్యదర్శికి సూచించారు. రికార్డులను పరిశీలించారు.

ఈకేవైసీ కోసం బారులు

లింగంపేట/ఎల్లారెడ్డి: ఈకేవైసీ కోసం గ్యాస్ లబ్ధిదారులు ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంతోపాటు లింగంపేటలోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలకు మంగళవారం ఉదయమే భా రీ సంఖ్యలో చేరుకున్నారు. సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఒక్కరి వేలిముద్ర లు తీసుకుంటామని, సమయం పెంచే అవకా శముందని ఏజెన్సీల నిర్వాహకులు సూచించారు.

దళితబంధు అక్రమాలపై విచారణ చేపట్టాలి

- పారదర్శక పాలనను అందించాలి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): దళితబంధు అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. దళితబంధు పేరిట దోచుకున్న సొమ్మును దళారుల నుంచి రికవరీ చేయించి దళితులకు న్యాయం చేస్తామన్నారు. మంగళవారం మండలంలోని అచ్చంపేట అతిథి గృహంలో జుక్కల్ నియోజకవర్గస్థాయి పంచాయతీరాజ్, నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులతో వేర్వేరుగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. గత ప్రభుత్వ పాలనలో మంజూరైన నిధులు, చేపట్టి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై శాఖల వారీగా నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి, అక్రమాలకు తావులేకుండా అధికారులు పనులు చేయాలని సూచించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రభుత్వంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు పారదర్శకమైన పాలననను అందిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని, వాటి పరిష్కారానికి తాను కృషి చేస్తానని అన్నారు. సమీక్షాసమావేశంలో జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్ మండలాల రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదలశాఖ అధికారులు, బాన్సువాడ రూరల్, బిచ్కుంద సీఐలు, ఎస్సైలు, ఈఈ, డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన, రాస్తారోకో



గర్గుల్‌లో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు



మద్నూర్‌లో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

కామారెడ్డి రూరల్/మద్నూర్/ఎల్లారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేసి తమ బతుకులను ఆగం చేసిందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం కామారెడ్డి–రామారెడ్డి రోడ్డుపై గర్గుల్‌లో రాస్తారోకో నిర్వహించారు. మద్నూర్ మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ మండలాల ఆటో డ్రైవర్లను నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుండగా, తమ బతుకులు ఆగమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు నెలకు రూ.15వేల జీవనభృతి, రూ.10లక్షల ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. మద్నూర్‌లోని తహసీల్, ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. గర్గుల్ గ్రామ ఆటోయూనియన్ అధ్యక్షుడు కె స్వామిగౌడ్, రాజిరెడ్డి, కోశాధికారి నాగరాజుగౌడ్, సెక్రటరీ సంజీవ చారి, సలహాదారులు చిట్టపురం శంకర్, కుంట శ్రీనివాస్, సాయికుమార్, కుంట చందు, హరీశ్‌యాదవ్, టి లింగం, చిరంజీవి, శివరాజు, కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె



జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు



బాన్సువాడలో సమ్మె చేస్తున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్/లింగంపేట/పిట్లం: సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం తమతో వెట్టిచాకిరి చేయిస్తోందని నిరసన వ్యక్తం చేస్తూ గ్రామీణ పోస్టల్‌ఉద్యోగులు జిల్లాలో మంగళవారం నిరవధిక సమ్మెను చేపట్టారు. గ్రామీణ తపాల ఉద్యోగుల కోసం కేంద్రం నియమించిన కమలేశ్ చంద్ర కమిటీ అందించిన సిఫార్సులను 8 సంవత్సరాలుగా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. 8 గంటల పని, రూ.5లక్షల గ్రాట్యుటీ, ఆరోగ్యబీమా, 12, 24, 36 సంవత్సరాలకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు లింగం, కార్యదర్శి నయీం, ప్రతినిధులు రుషి, తపాల సిబ్బంది పాల్గొన్నారు.

లింగంపేట మండల బీపీఎంలు జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. బాన్సువాడలో నిర్వహించిన సమ్మెలో ఆల్‌ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ సభ్యులు చంద్రశేఖర్, సాయినాథ్, సాయిలు, గౌస్, రవీందర్, లక్ష్మి, శ్వేత, రేఖ తదితరులు పాల్గొన్నారు. పిట్ల పోస్టాఫీస్ ఎదుట పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాల బీపీఎం, ఏబీపీఎంలు సమ్మె నిర్వహించారు.

అడ్లూర్‌ఎల్లారెడ్డి పాలశీతలీకరణ కేంద్రం జిల్లాలోనే ఆదర్శం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి పాలశీతలీకరణ కేంద్రాన్ని విజయ డెయిరీ డీడీ అండ్ ఏహెచ్‌వో సింహారావు, ఏడీ సంజీవ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. కేంద్రం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోనే ఆదర్శనీయంగా ఉందన్నారు. బీఎంసీయూని అభివృద్ధి బాటలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో డెయిరీ అధ్యక్షురాలు భాగ్యనర్సారెడ్డి, పాడి రైతులు పైడి చిన్ను, బీఎంసీయూ సూపర్ వైజర్ యాడారం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. సోమవారం నాటికి 65వేల 288టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన వార్షికోత్సవాలు



బీబీపేట: మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. గణపతి హోమం, మహాపడి పూజ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కేరళ ఆచార్యులు ఉన్నికృష్ణన్ నంబూద్రి, కన్నయ్య, మనోజ్ పాండే, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రాజంపేట: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం రాజంపేట మండల కేంద్రానికి చెందిన గరు స్వాములు ఆముద నాగరాజు, అంద్యాల రమేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప ఆలయ కమిటీలో సభ్యత్వం తీసుకున్నారు.

విద్యార్థులకు అవగాహన



రాజంపేట: ఆరోగ్య సంరక్షణపై మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు గైనకాలజిస్టు రాజ్యలక్ష్మి మంగళవారం అవగాహన కల్పించారు. వైద్యులు ప్రవీణ్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రమేశ్‌రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మార రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మద్దూరి పెద్దబాబు, ఎస్‌కే బాలయ్య, కార్యదర్శులుగా కావేటి సాయిలు, బదావత్ రమేశ్, కోశాధికారులుగా మధుసూదన్‌రెడ్డి, కంకటి శేఖర్, డైరెక్టర్లుగా వీరేశం, సుధాకర్, బాల్‌రెడ్డి, శేఖర్, నాయకులు నారాయణ, పూల్‌సింగ్ ఎన్నికయ్యారు.



హనుమాన్ ఆలయంలో పూజలు



పిట్లం(జుక్కల్): మండలంలోని పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ నిర్వాహకుడు తేజస్వామి తెలిపారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం కొచ్చరి మైసమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని నైవేద్యాలు సమర్పించారు.

బిల్లుల వసూళ్లలో వేగం పెంచాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నల్లా బిల్లుల వసూళ్లలో వేగం పెంచాలని కారోబార్లకు ఎంపీడీవో రాము సూచించారు. మంగళవారం ఆయన కారోబార్లతో సమావేశమయ్యారు. ఈనెల చివరి నాటికి వందశాతం బిల్లులు వసూలు చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : సైబర్ నేరాలబారిన పడకుండా మండల కేంద్రంలో పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్లు ఉపయోగించే వారు తమకు సంబంధం లేని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను లిఫ్ట్ చేయొద్దని సూచించారు. ఓటీపీలను ఎవరికీ చెప్పొదని, బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు ఎవరైనా కాజేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలంలో 2022–23 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధుల చెల్లింపునకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించనున్నారు. ఎంపీపీ నీరజావెంకట్రాంరెడ్డి అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహిస్తామని, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధిహామీ కూలీలు హాజరుకావాలని ఏపీవో మల్లేశ్ కోరారు. రూ.3కోట్ల 48లక్షల పనులకు ఆడిట్ బృందం తనిఖీలు చేపట్టారన్నారు.

నేడు ఎమ్మెల్యే పోచారం పర్యటన

బాన్సువాడ : పట్టణంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. బీఎస్సీ నర్సింగ్ కళాశాల, ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే సందర్శిస్తారు. అనంతరం సోమేశ్వర్ చౌరస్తా వద్ద ఉన్న ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని పార్టీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్ కోరారు.

నేడు విజయోత్సవ సభ

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాతారావు విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించాలని ఆయన కోరారు.

'ఆరోగ్య మహిళ'ను విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ డీపీవో పద్మజ అన్నారు. జిల్లా కేంద్రంలోని యూపీహెచ్‌సీ ఆస్పత్రిని ఆమె మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. మహిళలందరికీ ల్యాబ్‌టెస్టులు, అన్ని వ్యాధుల గురించి అవగాహన కల్పించి వారికి సరైన మందులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి ఈశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



బాన్సువాడ : జమియతుల్ ఉలేమా ఆధ్వర్యంలో మంగళవారం బాన్సువాడలో పేదలకు సీఐ మహేందర్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఫుట్‌పాత్‌పై నివసించే పేదవారికి, యాచకులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చలికాలంలో ప్రతి ఏడాది సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు మౌలానా, రఖీబ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



రామారెడ్డి (ఎల్లారెడ్డి): పోసానిపేట గ్రామాభివృద్ధితోపాటు రామారెడ్డి మండల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పోసానిపేట సర్పంచ్ మహేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యేను సర్పంచ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు రాధాబలరాం నాయక్ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సతీశ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక స్త్రీ శక్తి భవనంలో సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అభినందన



కామారెడ్డి టౌన్: నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రతిభ చాటిన మాందాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాయిక్రిష్, సీహెచ్ శ్రీనిధిని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం తన నివాసంలో అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని విద్యార్థులకు ఎమ్మెల్యే సూచించారు. సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సభ



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నర్సింలు

- విద్యుత్ అధికారులపై సభ్యుల ఆగ్రహం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాల్లో సమస్యలను పరిష్కరించని అధికారులు ఎందుకని, ఈ సమావేశాలు ఎందుకు నిర్వహిస్తారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ నర్సింలు అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంకులను నింపడం లేదని, నల్లాల ద్వారా నీరు ఎందుకు రావడం లేదని సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులను అడిగారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ మాట్లాడుతూ.. కొన్ని కారణాల వల్ల మల్లన్న గుట్ట నుంచి నీరు సక్రమంగా సరఫరాకావడంలేదని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. తాడ్వాయి, కరడ్‌పల్లి, ఎర్రాపహాడ్ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోవడంలేదని సర్పంచులు సంజీవులు, బాలచంద్రం, ఎంపిటీసీ జలందర్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులను నిలదీశారు. ప్రతి సమావేశానికి మండల వైద్యాధికారిణి ఎందుకు హాజరుకావడంలేదని హెచ్ఈవో నారాయణను సభ్యులు నిలదీశారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని పనులపై మాట్లాడారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్వీర్, జెడ్పీటీసీ రమాదేవి, తహసీల్దార్ సునీత, ఏవో శ్రీకాంత్, పశువైద్యుడు రాంచందర్, ఎంఈవో రామస్వామి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంజీవులు, అధికారులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపునకు సర్వే



వెల్లుట్లపేటలో పిల్లలను గుర్తించిన సీఆర్పీలు

ఎల్లారెడ్డిరూరల్/పిట్లం/లింగంపేట/గాంధారి : బడి బయటి పిల్లలను గుర్తించేందుకు అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేటలో బడి బయట తిరుగుతున్న నలుగురు పిల్లలను గుర్తించి సమీపంలోని పాఠశాలలో చేర్పించినట్లు సీఆర్పీ మహిపాల్ తెలిపారు. పిట్లం మండలం గుడితండా, గౌరారం, కారేగాం తండా ఆవాస ప్రాంతాల్లో సర్వే చేపట్టినట్లు సీఆర్పీలు తెలిపారు. బడి బయట పిల్లలను గుర్తించి పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గౌరారం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. సీఆర్పీలు హైమద్ పాషా, గోపాల్, విట్టవ్వ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లింగంపేట, బాణాపూర్ తదితర గ్రామాల్లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సర్వే నిర్వహించారు. ఇద్దరు డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించినట్లు వారు తెలిపారు. నెలరోజులపాటు సర్వే కొనసాగుతుందన్నారు. సీఆర్పీలు సంజీవ్, గంగాధర్, హెచ్ఎం షౌకత్అలీ, సవిత పాల్గొన్నారు. గాంధారి మండలం జువ్వాడిలో ముగ్గురు పిల్లలను గుర్తించినట్లు సీఆర్పీ రాజు తెలిపారు. సర్వేను జిల్లా సెక్టోరియల్ అధికారులు వేణుగోపాల్‌శర్మ, రమణ పరిశీలించారు.

ఆలయాలకు విరాళాలు



నగదును అందజేస్తున్న డీఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



తిప్పాపూర్‌లో విరాళం అందజేస్తున్న ఏనుగు స్వప్న

నిజాంసాగర్/భిక్కనూర్/బిచ్కుంద: ఆలయాల నిర్మాణం, అభివృద్ధి పనుల కోసం పలువురు దాతలు తమవంతుగా మంగళవారం విరాళాలు అందజేశారు. మహమ్మద్‌నగర్ మండలంలోని తున్కిపల్లి తండాలో వీరంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి డీఎస్ఆర్‌ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి రూ. 50 వేలు అందజేశారు. అలాగే బూర్గుల్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి మైక్‌సెట్, ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు లోక్యానాయక్ నాయకులు నర్సింలు, రాములు, అబ్బల్, గజ్జెల జీవన్, మనీశ్‌రెడ్డి, కుమ్మరిరాములు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూర్ మండలం తిప్పాపూర్ వేంకటేశ్వరాలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన ఏనుగు స్వప్నరాజేశ్వర్‌రెడ్డి రూ.25 వేలు అందజేశారు. రాజేశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేస్తున్నట్లు దాత తెలిపారు. సర్పంచ్ స్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్దరాములు, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిదులు ఏనుగు బాల్‌రాజురెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంజాగౌడ్, బస్వారెడ్డి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో హనుమాన్ ఆలయానికి మున్నూరుకాపు నాలుగవ పడి సంఘం సభ్యులు రూ. 49,100 నగదును అందజేశారు. గ్రామ పెద్దలు మల్లికార్జునప్ప షెట్కార్, కమల్ కిశోర్‌కు విరాళం అందజేశారు. సంఘం సభ్యులు చింతల హన్మాండ్లు, హాజీ బాల్‌రాజ్ స్వామి, ఎంపీటీసీ సురేశ్, నౌషానాయక్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను తరలించాలి



కామారెడ్డి అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా కామారెడ్డి పట్టణంలోని విద్యాసంస్థలకు వంద మీటర్ల లోపల ఉన్న మద్యం దుకాణాలను వెంటనే తొలిగించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా సభ్యులు కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దండోరా అధ్యక్షుడు వేముల బలరాం మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను ఇతర ప్రాంతాలకు తరలించని పక్షంలో ఆందోళన చేస్తామని, ఉన్నతాధికారులు, మంత్రులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు లక్ష్మణ్ మాదిగ, ఎం సత్తవ్వ, బి రమేశ్, ఎ దశరథ్, నర్సింలు, అశ్విని, స్వాతి, శ్వేత, సునంద తదితరులు పాల్గొన్నారు.